## క్లుప్తంగా

### మంచిరెడ్డిదే విజయం

యాచారం: బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజల ఆశీర్వాదంతో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమని జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మంచిరెడ్డి నియోజకవర్గంలో రూ.3 వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. రాష్ట్రంలోనే ఇబ్రహీంపట్నంకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఆయన భావించారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక స్థానాలను బీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకొని మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ సారి కిషన్‌రెడ్డి కచ్చితంగా మంత్రి అవుతారని తెలిపారు.

### కసిరెడ్డి గెలుపు కోసం..



సేవాలాల్ మహరాజ్‌కు పూజలు చేస్తున్న రవీందర్‌నాయక్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించాలని పట్టణంలోని సేవాలాల్ మహరాజ్ గుట్ట వద్ద శనివారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు మేడిగడ్డ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

### ఆచారి విజయం కోసం పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

మాడ్గుల: మండలంలోని ఇర్విన్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఆ పార్టీ అభ్యర్థి ఆచారి గెలవాలని అమనగల్లు వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ మెజార్టీ సాధించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజురెడ్డి, శ్రీశైలం, రమేశ్, అశోక్, మల్లేశ్, హరీశ్, భూపేశ్, గణేశ్, శేఖర్ పాల్గొన్నారు.

### స్నేహితుల ఔదార్యం



మల్లేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

తలకొండపల్లి: తమతో కలిసి చదువుకున్న మిత్రుడు చనిపోయాడని తెలుసుకొని సహచరులంతా చలించిపోయారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన మల్లేశ్ ఇటీవల ఓ ప్రమాదంలో మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న మిత్రులు శనివారం మల్లేశ్ కుటుంబాన్ని పరామర్శి.. రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు శివయ్య, సత్యం, మహేశ్వర్, వెంకటేశ్, బాలరాజ్, నిర్మల, వహీద్, జ్యోతి, నరేశ్, సంధ్యారాణి, రామయ్య, శివ పాల్గొన్నారు.

### ముగిసిన మైసమ్మ జాతర



కూరగాయల అలంకరణలో మైసమ్మ

కడ్తాల్: మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ జాతర ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆరురోజుల పాటు భక్త జనసందోహం మధ్య కొనసాగిన ఉత్సవాలను ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, శిరోలి, నాయకులు రామవత్ భాస్కర్‌నాయక్, అరుణ్ కుమార్, యాదగిరిస్వామి, చంద్రయ్య, దేవేందర్, బోడ్యా, రమాదేవి ఆలయ అర్చక సిబ్బంది భక్తులు ఉన్నారు.

# పట్నంలో పాగా ఎవరిదో?

- నేడే శాసనసభ ఎన్నికల ప్రజా తీర్పు
- సీవీఆర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు
- ఇబ్రహీంపట్నం పగ్గాలు ఎవరికో..?
- తేలనున్న కిషన్‌రెడ్డి, రంగారెడ్డి భవితవ్యం



బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కాంగ్రెస్ అభ్యర్థి, మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: శాసనసభ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో ఫలితాలపై అటు అభ్యర్థుల్లో ఇటు పార్టీ నాయకుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎవరికి వారు పైకి విజయంపై ధీమాగా ఉన్నా.. పోలింగ్ సరళిని బేరీజు వేసుకుంటూ సానుకూల, ప్రతికూల అంశాలను లెక్కేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలల్లో నిక్షిప్తమైంది. ఆదివారం (నేడు) ఓట్ల లెక్కింపుతో విజేతలు అసెంబ్లీకి, పరాజితులు ఇంటికి పరిమితం కానున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి హోరాహోరీగా తలపడ్డారు. ఇద్దరిలో ఎవరు విజేతగా నిలుస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి గంటల్లో వీరిద్దరి భవితవ్యం తేలనుంది. మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ కళాశాలలో నియోజవకర్గ ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దశాబ్దాల రాజకీయాల అనుభవం ఉన్న కిషన్‌రెడ్డి, రంగారెడ్డి పోటాపోటీగా రణరంగంలో తలపడ్డారు. ఒకరు రెండుసార్లు, మరొకరు మూడుసార్లు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కాలు మోపారు. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో రంగారెడ్డిని 356 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఓడించి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. మంచిరెడ్డి నాలుగోసారి, మల్‌రెడ్డి మూడోసారి అసెంబ్లీలో అడుగు పెట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ ఉత్కంఠకు నేడు తెరపడనుంది.

**గెలుపుపై ధీమాగా..**

నాలుగోసారి బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తారో.. లేదో వేచి చూడాలి. ఆయన సర్వశక్తులు వడ్డి గెలుపుకోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గాన్ని మొత్తం చుట్టేసి మరోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. దీనికి తోడు సీఎం కేసీఆర్ స్వయంగా ఇబ్రహీంపట్నానికి వచ్చి ప్రచారం చేశారు. సీఎం ప్రచారంతో పాటు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధే గెలిపిస్తుందనే ధీమాతో కిషన్‌రెడ్డి ఉన్నారు.

**ఎదురుచూపులు**

వరుస అపజయాలు చవిచూసిన మల్‌రెడ్డి రంగారెడ్డి ఈసారి ఎన్నికల్లో గట్టెక్కుతారా లేదా అనే ఆతృత ప్రజల్లో నెలకొంది. గతంలో ఓడిపోయిన సానుభూతి, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వీస్తున్న అనుకూల పవనాలు.. మల్‌రెడ్డి విజయానికి ఏ మేరకు సహకరిస్తాయో వేచి చూడాలి. ఈ ఇద్దరి భవితవ్యం మరికొద్ది గంటల్లో వెల్లడి కానుంది.

**ప్రజాక్షేత్రంలో వెనుకబాటు**

బీజేపీ, సీపీఎం, డీఎస్పీ, బీఎస్పీకి నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో కేడర్ లేకపోవడం ఈ ఎన్నికల్లో లోపంగా కనిపిస్తుంది. బీజేపీ అభ్యర్థిగా నోముల దయానంద్‌గౌడ్, సీపీఎం నుంచి పగడాల యాదయ్య, బీఎస్పీ నుంచి గొరిగే మల్లేశ్, డీఎస్పీ అభ్యర్థిగా తులసిగారి రవీందర్ పోటీలో ఉన్నా.. ప్రజాక్షేత్రంలో వెనుకబడి ఉన్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**సిబ్బందికి ప్రత్యేక శిక్షణ**

- కేంద్రం వద్ద మూడంచెల భద్రత
- ఇబ్రహీంపట్నం ఆర్వో అనంతరెడ్డి



ఇబ్రహీంపట్నం ఆర్వో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. శనివారం సాక్షితో ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపులో ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామని పేర్కొన్నారు. సుమారు 3,057 పోస్టల్ ఓట్లను 6 టేబుళ్లపై లెక్కిస్తామన్నారు. ఎనిమిదిన్నరకు ఈవీఎంలల్లో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తామని తెలిపారు. 14 టేబుళ్లు, 25 రౌండ్లలో లెక్కింపు కొనసాగుతుందన్నారు. 300 మంది సిబ్బంది నియమించినట్లు తెలిపారు. ప్రతి టేబుల్‌కు మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్‌తో పాటు వారికి అవసరమైన సహాయక సిబ్బంది, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో అదనంగా ఏఆర్ఓతో పాటు మరో ఇద్దరు అదనంగా అందుబాటులో ఉంటారని వివరించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులకు సహకరించాలని కోరారు. సీవీఆర్ కళాశాలలోనే ఇబ్రహీంపట్నంతో పాటు కల్వకుర్తి, మహేశ్వరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

### అయ్యప్ప పూజలో మంత్రి

పహాడీషరీఫ్: అయ్యప్ప నామస్మరణతో జల్‌పల్లి శనివారం మార్మోగింది. గ్రామానికి చెందిన సూరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి మాలధారణతో శబరిమలకి కాలినడకన వెళ్లొచ్చి పడిపూజ నిర్వహించారు. దీనికి మంత్రి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జనార్దన్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను శుభ్రం చేయిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గ్రామ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రత్యేక పారిశుధ్య నిర్వాహణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని, పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌లోనే చెత్త వేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వేస్తే పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాఘవేందర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# విజయం ఎవరిని వరించేనో?

**హోరాహోరీగా సాగిన పోరు**

- కొద్ది గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

మొయినాబాద్: హోరాహోరిగా సాగిన చేవెళ్ల పోరులో విజయం ఎవరిని వరిస్తుందో మరికొన్ని గంటల్లో తేలనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ఎన్నికల ఫలితం ఎలా ఉండబోతుందోనని నేతల్లో నెలకొన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది.

**కారు దూసుకెళ్లేనా..?**

బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థుల ప్రకటించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకే మళ్లీ టికెట్ కేటాయించింది. అప్పటి నుంచే ఆయన నియోజకవర్గంలో ముమ్మర ప్రచారం చేశారు. ఇది ఇలా ఉండగా ఈ సారి కాంగ్రెస్ గాలి వీస్తుందని ముందునుంచే ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కారు దుసుకెళ్తుందా! లేదా అనే సందేహాన్ని అందరూ వ్యక్తం చేస్తున్నారు. చేస్తున్నారు.

**హస్తం హవా కొనసాగుతుందా..**

చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట అనే పేరుంది. ఇక్కడ ఎక్కువ సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో కాలె యాదయ్య కాంగ్రెస్ నుంచే గెలుపొందారు. తరువాత బీఆర్‌ఎస్‌లో చేరి 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అయితే ఈసారి కాంగ్రెస్ పామెన భీంభరత్‌కు అవకాశం ఇచ్చింది. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు చేవెళ్లలో గెలుపుకోసం కష్టపడి పనిచేశారని పలువురు చెబుతున్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు.

**కమలం వికసిస్తుందా..**

గతంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఎప్పుడూ గట్టి పోటీ ఇవ్వలేదు. ఈ సారి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం కమలం కండువా కప్పుకుని బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. దీంతో చేవెళ్లలో కమలం వికసిస్తుందని మొదటి నుంచి ఆ పార్టీ శ్రేణులు గట్టి నమ్మకంతో పనిచేశాయి. గెలుపుపై అభ్యర్థులు, నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విజేత ఎవరో కొద్ది గంటల్లోనే తేలనుంది.

# ఘనంగా పడిపూజ



మొయినాబాద్‌రూరల్: పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ గ్రామంలో శనివారం వినోద్‌కుమార్ గంట స్వామి, నవీన్ కుమార్ కత్తి స్వామి ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజను రాంచందర్ గురుస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పూలు, పండ్లు నూతన వస్త్రాలు సమర్పించి పడిపూజ చేశారు. కుమ్మరి శోభాసత్యయ్యలు స్వాములకు అన్నదానం చేశారు. గురుస్వాములు మురళి, రవీందర్, మహేందర్, మల్లేశ్‌యాదవ్, సతీశ్‌గౌడ్, మల్లేశ్ ముదిరాజ్, అశోక్‌చారి పాల్గొన్నారు.

**భక్తి భావంతో మెలగండి: బక్కని నర్సింలు**

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. సోలీపూర్ గ్రామ శివారులోని చౌడమ్మ గుట్ట హనుమాన్ ఆలయంలో వ్యాపారవేత్త ఎల్ కుమార్‌గౌడ్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బక్కని నర్సింలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. భక్తి భావంతోనే మనస్సును ఏకాగ్రతతో ఉంచుకోవచ్చన్నారు. ఆలయంలో స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. గురుస్వామి సత్యనారాయణ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, కృష్ణ, ప్రమోద్, సునీల్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలంగౌడ్, అన్మారి వెంకటయ్య పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న బక్కని నర్సింలు సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**నందిగామలో..**

నందిగామ: మండల పరిధిలోని పారిశ్రామికవాడలో అయ్యప్ప ఆలయంలో స్వాములకు అన్నదానం చేశారు. కొత్తూరు మండలం ఎస్బీపల్లికి చెందిన లింగారం సురేశ్‌గౌడ్ సహకారంతో అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# పైకి గాంభీర్యం.. లోపల భయం

- అభ్యర్థుల్లో టెన్షన్
- ఫలితాల ముందు మహేశ్వరంలో ఆందోళన
- గ్రామీణ ప్రాంతంలో పెరిగిన పోలింగ్ శాతం



పట్లోళ్ల సబితారెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి



కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి



అందెల శ్రీరాములు యాదవ్, బీజేపీ అభ్యర్థి

మహేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల పర్వం ముగిసింది. ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. సర్వేలు నమ్ముకున్న రాజకీయ పార్టీలు మాత్రం విజయం సాధిస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అలాగే ప్రజలు ఎటువైపు ఓటేశారోనన్న గుబులు అభ్యర్థుల్లో వెంటాడుతోంది. పోలింగ్ ప్రక్రియ పూర్తయినా సర్వేలు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో పలు సంస్థలతో సర్వేలు చేయించిన పార్టీలు ప్రస్తుతం సొంతంగా సర్వేలు నిర్వహించి గెలుపోటములు తెలుసుకుంటున్నారు.

**నేతల్లో ఆందోళన..**

నియోజకవర్గంలో ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులను ముఖ్య నాయకులు రహస్యంగా కలిసి వ్యూహాలు రచించారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యే విజయం ఊగిసలాడుతోందని తెలుస్తుంది. ఓటింగ్ శాతం తక్కువగా నమోదు కావడంతో అభ్యర్థుల్లో గుబులు నెలకొంది. బీఆర్‌ఎస్ నుంచి మంత్రి సబితారెడ్డి, బీజేపీ నుంచి అందెల శ్రీరాములు యాదవ్, కాంగ్రెస్ నుంచి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బీఎస్పీ నుంచి కొత్త మనోహర్‌రెడ్డిలు పోటీ పడ్డారు. నియోజకవర్గంలో 542 పోలింగ్ స్టేషన్లలో మొత్తం 5,46,577 మంది ఓటర్లు ఉండగా 3,02,762 ఓట్లు పోలై 55.39 శాతం నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడంతో పాటు బాలాపూర్ మండలంలో కూడా 1,55,765 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం తక్కువ కావడంతో అభ్యర్థుల్లో భయం పట్టుకుంది. కొన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడంతో అక్కడ అభివృద్ధిని చూసి అధికార పార్టీకి ఓటేశారని బీఆర్‌ఎస్ నేతలు అంటుంటే లేదు లేదూ ప్రభుత్వంపైన వ్యతిరేకత పెరగడంతో అధికంగా ఓటింగ్ శాతం నమోదైందని ప్రతిపక్ష పార్టీల నేతలు అంటున్నారు. సైలెంట్ ఓటింగ్ తమకే అనుకూలంగా పడ్డాయని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఎవరికి వారో గెలుపోటములపైన అంచనాలు వేసుకుంటున్నారు.

**మనస్ఫూర్తిగా దక్కని మద్దతు**

గతంలో కుల సంఘాలు, యువజన సంఘాలకు చెందిన ఓట్లను గంపగుత్తగా రాజకీయ పార్టీలు మళ్లించుకునేవారు. ఓటు వేసేలా సంఘాల నుంచి హామీ తీసుకునేవారు. ప్రస్తుతం ప్రతి కుల సంఘంలోనూ వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు ఉండడంతో ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఎవరు కోరినా మీ పార్టీకే మద్దతు ఇస్తున్నట్లు ఆయా సంఘాల పెద్దలు చెప్పడంతో ఓట్లు ఎవరికి పడ్డాయో తెలియడం లేదని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు అంటున్నారు. ఎవరిని కదిలించిన మీకే ఓటేశామని చెబుతున్న వాస్తవానికి ఓటు ఎవరికి వేశారో చెప్పలేకపోతున్నామని నేతలు వాపోతున్నారు.

### ‘ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది కాంగ్రెస్ పార్టీనే’



దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసిన సందర్భంగా శనివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

### బీసీని సీఎం చేయాలి

హస్తినాపురం: తెలంగాణలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీ అభ్యర్థిని సీఎంగా ప్రకటించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం హస్తినాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..బీసీలను సీఎం సీటు దగ్గరకు రానివ్వని పార్టీ లు 60 శాతం బీసీ ప్రజల తరపున 75 ఏళ్ల నుంచి అందని ద్రాక్షలానే మిగిలిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ఆదివారం జరగబోయే ఓట్ల లెక్కింపులో మెజార్టీ స్థానాలు సాధించిన పార్టీ సీఎంగా బీసీని చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వినోద్, బోయపల్లి లింగస్వామి, వలిజాల యాదయ్య, నాంపల్లి మల్లేశ్ పాల్గొన్నారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు



శ్రీలత(ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ ప్రాంతానికి చెందిన శ్రీలత(28) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తన సోదరి అరుణజ్యోతి ఇంటి సమీపంలో నివాసం ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం శ్రీలత బయటికి వెళ్తున్నానని తల్లికి చెప్పింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో సోదరి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అంతటా టెన్షన్.. టెన్షన్

- భవితవ్యంపై అభ్యర్థులు, పార్టీల నాయకుల్లో పెరిగిన ఉత్కంఠ
- ఎగ్జిట్‌పోల్స్‌పై అన్ని పార్టీల అభ్యర్థుల్లోనూ ఆందోళన

దిల్‌సుఖ్‌నగర్: పోలింగ్ పూర్తి కావడం, కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అంతట టెన్షన్ వాతావరణం నెలకొంది. కొన్ని రోజులుగా ప్రచారాలతో బిజీబిజీగా ఉన్న ప్రధాన పార్టీల నాయకులు కౌంటింగ్ సమయం ఆసన్నమవడంతో నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత సంవత్సరం కంటె పోలింగ్ తక్కువ కావడంతో అది ఎవరికొంప ముంచుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎంతో కష్టపడి పార్టీల టికెట్లు తెచ్చుకొని రాత్రింపగళ్లు అంతటా ప్రచారం చేసి ఇప్పుడు ఎన్నికల్లో గెలవకపోతే పరిస్థితి ఏమిటని తమ భవిష్యత్తు అంతా అంధకారమైపోతుందని అటు పార్టీల అభ్యర్థులు, నాయకులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మహేశ్వరం, మలక్‌పేట్ నియోజకవర్గాల్లోని పార్టీల అభ్యర్థుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. నియోజకవర్గాల్లో పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎక్కడ కనిపించడం లేదు. మరికొంత మంది చిన్నాచితక పార్టీలు, ఇండిపెండెంట్ల అభ్యర్థులు తమ ఓటమిని ముందుగానే నిర్ణయించుకున్నారు. గెలుపుపై ఆశలు పెట్టుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టిన తమకు కచ్చితంగా విజయం లభిస్తుందని గంపెడాశతో ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ పార్టీల అభ్యర్థుల ఆందోళనకు తెరపడాలంటే ఇక మరికొన్ని గంటలు ఈ టెన్షన్ అనుభవించక తప్పదు.

# కందుకూరులో తగ్గిన పోలింగ్ శాతం

**41,782 మంది వినియోగించుకున్న ఓటు**

కందుకూరు: అసెంబ్లీ ఎన్నికల్లో కందుకూరు మండలంలో గతంలో కంటే పోలింగ్ శాతం తక్కువగా నమోదైయింది. 2018 ఎన్నికల సమయంలో మండలంలో 22,524 మంది పురుషులు, 21,440 మంది మహిళలు, మొత్తం 43,964 మంది ఓటర్లు ఉన్నారు. కాగా అప్పట్లో జరిగిన ఎన్నికలో పురుషుల ఓట్లు 19,522, మహిళల ఓట్లు 18,322 పోలయ్యాయి. మొత్తం 37,884 ఓట్లు పోలైయి 86.07 శాతం ఓట్లు నమోదైయ్యాయి. ఈసారి జరిగిన ఎన్నికల్లో 25,932 మంది పురుషులకు గాను 21,334 మంది, 25,107 మంది మహిళలకు గాను 20,448 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 41,782 మంది ఓట్లు వేయగా, మొత్తం 81.86 శాతం ఓటింగ్ నమోదైయింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 4.26 శాతం తక్కువగా నమోదైయింది. 2018లో పురుషులు 86.67 శాతం ఓట్లు పోలవగా, ఈసారి 82.27 శాతంగా నమోదైయింది. 2018లో మహిళల ఓట్లు 85.45 శాతం పోలవగా, ఈసారి 81.44 శాతంగా నమోదైయింది. పురుషుల ఓట్ల శాతం గతంతో పోలిస్తే 4.4 శాతం, మహిళల ఓట్ల శాతం 4.01 తక్కువగా నమోదైయింది. 2018లో పురుషుల కంటే మహిళల ఓట్ల శాతం 1.22 తక్కువగా నమోదైయింది. ఈసారి 0.83 శాతం మాత్రమే తక్కువగా నమోదైయింది.

# ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

వనస్థలిపురం: గణేశ్ టెంపుల్ రోడ్డు, రైతుబజారు కూడలిలో నిత్యం ట్రాఫిక్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గణేశ్ టెంపుల్ రోడ్డులో పలు వాణిజ్య కేంద్రాలు, ఆలయాలు ఉండడంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అలాగే వనస్థలిపురం రైతుబజారు చౌరస్తాలో వనస్థలిపురం నుంచి సుష్మ చౌరస్తా, బీఎన్‌రెడ్డినగర్ వైపు నుంచి, హయత్‌నగర్ వైపు వాహనాలు జిగ్‌జాగ్‌గా వస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆయా కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



గణేశ్ టెంపుల్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు